# శాస్తి

**–బి. ఆగరాజు**

అర్ధరాత్రి–

అది మధ్యగది. ఆ గదిలో ఐదుప్లస్ ప్రాయంగల సుధీర్ కనురెప్పలు బరువుగా, భారంగా విచ్చుకున్నాయి. నిద్రమాత్ర ఇదివరకులా పనిచేస్తే, ఆ సమయానికి నిద్రమేల్కొని, కండ్లు తెరిచేవాడు కాదు.

గది నిండా గాఢాంధకారం. కనులు పొడుచుకున్నా కానరాని కటిక చీకటి. దానికి తోడు నిశ్శబ్దం. కమ్మగిలుక్కుమన్నా వినిపించే భయానక నిశ్శబ్దం.

ఆ చిన్నోడి ఎదగదిలో, దడ దడమంది. గదియంతా వాడి చూపులు కలయ చూసాయి. ఏదీ కనిపించడం లేదు. అంతా చిక్కని చీకటి.

జీరో బల్బు ఎప్పుడారిపోయిందో, ఆరిపోయింది. అదిపోతే పోయింది. వీధిదీపానికేమయింది? అదీ పోవాలా! అంతటా విద్యుత్కోత. ఎప్పుడైనా, ఎక్కడైనా ఆ కోత తప్పదు. అందుకే సుధీర్ గది అంత అంధకారాని కాల వాలమయింది. రాశిపోసిన మసిలా, గదినిండా ముసిరి, ముసిరి పోతుంది నిశిరక్కసి.

సుధీర్ కుడిచేత్తో తడిమి చూశాడు. హాసిని మించి నిద్రలో ఉంది. అది నిద్ర మాత్ర ప్రభావం! ఇప్పుడప్పుడే లేచేలా లేదు ఆ చిన్నారి.

''మమ్మీ! మమ్మీ!'' అని భీతావహుడై పిలిచాడు సుధీర్.

రాత్రుల్లో ఎప్పుడైనా మేల్కొస్తే, గదిలోకాంతి కాంతిగా ఉండేది. ఇలా చూడ్డం ఇదే మొదటిసారి.

పక్కగదిలోంచి హర్షిత ఉలుకులేదు, పలుకులేదు.

''మమ్మి! మమ్మీ!'' అని మళ్లీ, మళ్ళీ అరిచాడు సుధీర్. ఆ అరుపులకు మారుగా మాతృమూర్తికి బదులు, పవర్ వచ్చింది. జీరోబల్బు వెలిగింది. గది నిండా పల్చని కాంతి విస్తరించుకుంది.

సరిగ్గా అదే సమయానికి, ఏమాత్రం సవ్వడికి తావివ్వకుండా, మధ్యగది తలుపు తెరుచుకున్నాయి. పిల్లుల్లా లోని కడుగిడిన అమ్మా నాన్నల్ని గాంచిన సుధీర్, ''మమ్మీ!'' అంటూ పక్క మీంచి ఒక్కగెంతు గెంతి, మాతృదేవిని చిట్టి చిట్టి చేతులతో చుట్టేశాడు.

పిల్లల్నిద్దరిని ఇంట్లో ఉంచి, ఇంటికి తాళం బిగించి, తమ ముద్దు ముచ్చట్లు తీర్చుకోడానికి, సరదా సౌఖ్యాలు వెతుక్కోడానికి వెళ్లడం, ఆ తల్లిదండ్రులకిది తొలిసారి కాదు. ఇలా ఎన్నిసార్లో! పోతే పుత్రుడికి పట్టుబడటమే ప్రథమం.

★★★

హర్షిత బాగా ఉన్నింటి వాళ్ల చిన్నది. ఏ అడ్డూ, ఆపూ ఎరక్కుండా నింగిలోవిహంగంలా, స్వేచ్ఛగా విహరిస్తూ, ఏపుగా ఎదిగొచ్చిన కన్నెది.

తాహతుకు తగిన కుటుంబాల్లో, హర్షిత ఎత్తుకు తగిన వరుడు ఎంత వెతికినా దొరకలేదు. కన్నవారికి అది సమస్యగా పరిణమించిందికాని, అయినా వాళ్లు నిరాశానిస్పృహలకు లోనుకాలేదు. పైగా అది పుట్టింది దాని మొగుడు పుట్టకుండా ఉంటాడా?'' అనే ధీమాతో ఉన్నారు. ఇదివరకులా కాక, ఒక మెట్టు దిగి, శక్తివంచన లేకుండా, వరాన్వేషణా ప్రయత్నాన్ని ద్విగుణీకృతం చేశారు.

సమయం కలిసొచ్చింది. ఆదిత్య విషయం తెలిసొచ్చింది. ఏ.జి. ఆఫీసులో ఆడిటర్, వెళ్లి చూశారు. చెయ్యెత్తు మనిషి. హర్షితకు అన్ని విధాలా ఈడూ–జోడూ అయినవాడు. మధ్యతరగతి కుటుంబీకుడైనా, పట్టరాని సంతోషంతో 'శుభస్యశీఘ్రం' అన్నారు. హర్షిత ఆదిత్యల కళ్యాణం ఘనంగా కావించారు. 'కక్కొచ్చినా, కళ్యాణమొచ్చినా ఆగదని ఊరకే అన్నారా పెద్దలు!''

హర్షితపేర త్రీ ఆర్టీ క్వార్టరు, ఆదిత్య పేర స్కూటరు కొనిచ్చారు.

అంతటితో ఆగక, ఒక సంసారానికవసరంకన్నా ఎక్కువే సకల సౌకర్యాలు, సదుపాయాలు సమకూర్చి, అనతికాలంలోనే వేరు కాపురం పెట్టించారు హర్షిత అమ్మానాన్నలు. ఉన్నవాళ్ళు కదా, ఏమయినా చేయించగలరు.

ఆదిత్యది సర్దుకుపోయే తత్త్వం. హర్షితకది కలిసొచ్చిన అదృష్టం. భార్య అభిమతమే తనదిగా మసలుకోవడంతో, వారిలో అన్యోన్యత, ఆప్యాయత, అనురాగం ముప్పేటలా పెనవేసుకుపోయింది. కలతలకు, కార్పణ్యాలకు, కల్లోలాలకు ఆస్కారం లేకుండా అయింది.

ఐదేండ్లదాకా పిల్లలక్కర్లేదనుకున్న హర్షిత, భర్త ఇష్టాయిష్టాలతో ప్రమేయంలేకుండా, కుటుంబ సంక్షేమ పథకాన్ని అక్షరాలా పాటించింది.

అనుదినం సాయంవేళల్లో హర్షిత పతిదేవుడ్ని వెంటేసుకొని, సినిమాలకు, షికార్లకు వెళ్లేది. ఏ స్టార్ హోటల్లోనో కడుపార తిని, ఏ రాత్రికో ఇంటికి రావడం దిన చర్యయిపోయింది.

భూమాత ఎంతోహాయిగా, ఆహ్లాదంగా సూర్యభగవానుని చుట్టు అయిదుసార్లు ప్రదక్షిణలు క్షణాల్లో చేసినట్లయింది.


అది హర్షిత ఆదిత్యలకు అయిదో పెళ్లిరోజు రాత్రి–


''హర్షితా! ఇక మనం, మన దాంపత్య జీవితాన్ని ఫలప్రదం చేసుకుందామా?'' అని అర్థించాడు ఆదిత్య.

హర్షిత శ్రీవారి అభ్యర్థనమేరకు మనస్ఫూర్తిగా కొంగుపరిచింది.

ఏడాదిలోగా హర్షిత ముద్దొచ్చే వంశోద్ధారకుని ప్రసాదించి, భర్త అభీష్టాన్ని నెరవేర్చింది. మరో మూడేళ్లలోగా చక్కని చుక్కను ప్రసవించి ట్యూబెక్టమీ చేయించుకుంది.

సంతానం తన స్వేచ్ఛను హరిస్తుందని, సరదాలకు అడ్డుపడుతుందని ఊహించనందుకు ఎంతో చింతించింది హర్షిత. తొలి సంతానంతో పూర్వంలా సంచరించలేకపోయింది. వారానికొక మారుగా సరిపెట్టుకుంది. మలిసంతానం వల్ల అదీ కుదరలేదు. పక్షానికోసారిగా మారింది.





సెలవు
రోజుల్లో షికార్లకు పోవడానికి, హర్షితకు సమయా సమయాల పట్టింపులేదు. ఎప్పుడు వెళ్ళాలనిపిస్తే అప్పుడు ఆదిత్యను తోడుకొని, వెళ్లిపోవడమే. కాని పిల్లల్ని ఇంట్లో ఉంచేయడం, ఇంటికి తాళం వేసి, ఎంచక్కా చెక్కేయడమే ఘోరం. పైగా వెళ్లేముందు పాలల్లో సగం, సగం నిద్రమాత్రవేసి, తాగించి, పడుకోబెట్టి వెళ్లడం మహా ఘోరం. పాపం ఆ పిల్లలు! మత్తు నిద్రలోపడి, వాళ్లు వచ్చాక కూడా లేచేవారు కాదు.

నిద్రమాత్రల మోతాదు ఎప్పుడూ ఒకేలా ఉండదు. ప్రస్తుతం సుధీర్ ఆ దశకు వచ్చేశాడు. అమ్మా, నాన్నలు రాకముందే అతని నిద్ర తేలిపోయింది.

★★★

మరునాటి ఉదయం సుధీర్ నిద్ర లేచీ లేవగానే, తల్లిదరి చేరి, ''మమ్మీ! మమ్మల్ని ఇంట్లో ఉంచి, ఎక్కడికి వెళ్లావమ్మా? లైట్లు పోవడంతో నాకెంత భయమేసిందో తెలుసా?'' అని నిలదీశాడు.

హర్షిత వెంటనే జవాబివ్వలేక, కొన్ని లిప్తలకాలం అవాక్కయింది. ఆనక తేరుకొని, ''మన ఇంట్లో మనకు చీకటయితే భయమా? భయపడొద్దమ్మా. మగబిడ్డవు. ధైర్యంగా ఉండాలి. ఇకపైన బుడ్డీ దీపం వెలిగించి ఉంచుతా. సరేనా?'' అని తనయుని సమాధాన పరచింది. కాని అది సుధీర్ ప్రశ్నకు జవాబు కాదు.

★★★

పక్షం రోజులనంతరం, ఒక రాత్రి-


సుధీర్ హాసినులకు ఉన్నట్టుండి నిద్రా భంగమయింది.

''మమ్మీ!''అని ముక్తకంఠంతో అరుస్తూ లేచారు. ఒకరినొకరు గట్టిగా పట్టుకొని, ''మమ్మీ, మమ్మీ!'' అంటూ గడగడలాడసాగారు.

చిన్నారు లిరువురు భయవిహ్వాలులవడానికి బలీయమైన కారణముంది. పెద్దపాటి పిల్లులు రెండు, కిటికీ గుండా నిద్రిస్తున్న పిల్లలపై దూకి, ముందుకు పోయాయి. ఎటూ దారితెలీక ''మ్యావ్..మ్యావ్''మని వివిధస్థాయిల్లో ధ్వనులు చేయసాగాయి.

ఆ అరుపులకు పసిపిల్లలు తల్లిని పిలుస్తూ ఏడ్పులంకించుకున్నారు. పది నిమిషాలు భయం భయంగా గడిచాయి. ఇంత జరుగుతున్నా తల్లి గది తలుపు తెరుచుకోలేదు. అంచేత సుధీర్ అంతరంగంలో, మమ్మీ ఇంట్లో లేకపోవచ్చనే సందేహం పురుడుపోసుకుంది.

అంతలోనే స్కూటర్ వచ్చి, ఆగిన శబ్దమయింది. ముందుగది తాళం తీసి, లోనికొచ్చిన అలికిడయ్యింది. మధ్యగది తలుపులు తెరుచుకుంటున్న చప్పుడుకు, పిల్లలు రెండు ఒకదాన్ని పట్టకుండా ఒకటి, వచ్చిన దోవనే ఎన్నుకొని, 'బ్రతుకు జీవుడా' అని బయటపడ్డాయి.




హర్షిత ఆదిత్యలు గదిలోకి ప్రవేశించి, కన్నీరు మున్నీరవుతున్న తమ పిల్లల దీనావస్థకు ఎంతో దిగులు పడ్డారు.

"సుధీర్!ఏమయింది?" అంటూ హర్షిత ఆదిత్యలు పిల్లలకిరుపక్కల చేరి, చెరొకరిని అక్కున చేర్చుకున్నారు.

సుధీర్ వణుకుతూనే జరిగింది వివరించాడు.

"ఓ... అలాగా!" అని ఆదిత్య వెళ్ళి, కిటికీ రెక్కల్ని మూసి, బోల్టుబిగించాడు.

"ఇక భయం లేదు. పడుకోండి" అని హర్షిత పిల్లల్ని పడుకోబెట్టి, దుప్పటి కప్పింది.

ఆ రాత్రి మంచం మీద మేను వాల్చి 'ఇకమీదట రాత్రిపూట, ఎటూ పోకూడద'ని ఆ దంపతులు లెంప లేసుకున్నారు. ఒకరి మీదొకరు ప్రమాణం కూడా చేసుకున్నారు.

★★★

అనుకున్న ప్రకారం, హర్షిత నెల పదిహేను రోజులపాటు, కట్టుబడి ఉండ గలిగింది. మనసు పడిపడి, తహతహలాడినా అతి ప్రయత్నం మీద, తనను తాను నిగ్రహించుకోగలిగింది.

కాని, ఆ తరువాత ఒకనాటి రాత్రి, తాము చేసుకున్న ప్రమాణం మీద నిల్చుండలేక, పూర్వంలా పతిదేవుడితో మళ్లీ ఇల్లు కదిలింది హర్షిత.

సుధీర్‌కు మత్తు నిద్ర ముంచుకొస్తున్నా లెక్కచెయ్యలేదు. బుర్రలో ఆలోచనలకు 'కీ' ఇస్తూ లేచి కూర్చున్నాడు. లేచి కూర్చోవడంలోని ఆంతర్యం మత్తు నిద్రని పారదోలాలనే!

ఇంకా మమ్మీ మారలేదని గ్రహించాడు సుధీర్. ఇక చేతులు కట్టుకొని కూర్చోకూడదనుకున్నాడు. ఏమయినా చేయాలి. మమ్మీలో మార్పు తేవాలి. ఎలా? అనే ఆలోచనతో గదిని నిశితంగా పరిశీలించాడు.

ఉన్న ఒక్క కిటికీ మూసి, బోల్ట్ వేసి ఉంది. తలుపులు మూడూ మూసే ఉన్నాయి. వెనుక వరండాకు, మమ్మీగదిలోకి దారితీసే ద్వారాలకు బోల్ట్ వేసి ఉంది. ముందు గదివైపు తలుపులకే వేసి లేదు. 'ఆ పని చేస్తేసరి'. అనే ఆలోచన మెరుపులా మెరిసింది. లేడికి లేచిందే పరుగులా ఆ పని చేసి, నిశ్చింతగా నిద్ర కుపక్రమించాడు.

★★★

కాలనీ అంతా ప్రగాఢ నిద్రలో ఉంది. వీధులు నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా ఉన్నాయి. వీధిలైట్లు కొన్ని పేరుకే తమ ఉనికిని తెలుపుకుంటున్నాయి. వాటి మధ్య చీకటి గంతులేస్తుంది.

హర్షిత ఆదిత్యలు కాంపౌండు లోపలికి వచ్చారు. తాళం తీసి, ముందుగదిలోకి ప్రవేశించింది హర్షిత. మధ్య గది బోల్ట్ దీసి, తలుపుల్ని తోసింది. తెరుచుకోలేదు. షాక్ తిన్నట్లయిందామెకు.

ఆదిత్య స్కూటర్ పార్క్ చేసి వచ్చి, "ఏమయింది?" అన్నాడు.

"లోపల బోల్ట్ వేసి ఉంది" నీరసంగా అంది.

"ఇది సుధీర్ పనే" అని "సుధీర్! సుధీర్!" అని బిగ్గరగా పిలిచాడు.

"మెల్లగ పిలవండి" హీనస్వరంతో సూచించింది.

"ఎందుకు?"

"ఇరుగు పొరుగువింటారండి"

"మరి సుధీర్ మేల్కొంటాడా? పైగా నిద్రమాత్రల నిద్రాయె"

హర్షిత ముఖం వాల్చుకుంది.

"సుధీర్! సుధీర్!" అని ఆదిత్య పలుమార్లు పిలిచాడు. ఎలుగెత్తి పదే పదే అరిచాడు.

పిల్లలిద్దరిలో ఏ ఒక్కరూ లేవలేదు. ఇరుగు పొరుగు మాత్రం లేచి వచ్చారు. ముందు గదిలో దంపతులను చూసి, విస్తుపోయారంతా.

"ఏమిటండీ ఆ అరుపులు? పిల్లల్ని ఇంట్లో ఉంచి, మధ్యరాత్రి దాకా ఎక్కడికి వెళ్లారండి? పసిపిల్లల్ని ఇలా వదిలి వెళ్లొచ్చా? ఎంత అమానుషం!" అని కరువుగా మందలించారొకరు.

"మీలాంటి వాళ్లు ఉంటారని వినలేదు బాబు. ప్రత్యక్షంగా చూసే దౌర్భాగ్యం కలిగింది మాకు." మొహం మీదే అసహ్యించుకున్నా డింకొకరు.

"ఇల్లలుకగానే పండుగకానట్లు, పిల్లల్ని కనగానే తల్లిదండ్రులైపోరు. వారి ఆలనాపాలనా, ముద్దుముచ్చటా చూడాలండి. వాళ్లకావలసింది అమ్మానాన్నల అనురాగం, ఆప్యాయత. అంతేకాదు, వాళ్లని ఏ విధంగానూ అలక్ష్యానికి, అనాదరణకు గురిచేయరాదు. అప్పుడు.... అప్పుడేనండి నిజమైన తల్లిదండ్రులయ్యేది" అని ఒక పెద్దమనిషి కన్నవాళ్ల కర్తవ్యాన్ని గుర్తుచేశాడు.

"పిల్లలు మంచి నిద్దర్లో ఉన్నారు. ఆ అరుపులు, కేకలు మాని, ఎలాగో ఈ రాత్రికి సర్దుకొని మీరూ పడుకోండి. మమ్మల్ని పడుకోనివ్వండి" ఉచిత సలహానిస్తూ, మెత్తగా మొత్తింది ఒక మహిళామణి.

"ఇది ఎన్నాళ్లుగా సాగుతుందో! కన్నకొడుకైనా తగిన శాస్తి చేశాడు. ఇకనైనా బుద్ధి తెచ్చుకుంటారోలేదో! వేచి చూడాల్సిందే" సన్నాయి నొక్కులు నొక్కింది, ఇంకొక వనితారత్నం.

వచ్చినవాళ్లు వచ్చినట్లు తలా ఇన్ని అక్షింతలు వేసి, చక్కా వెళ్లిపోయారు.

హర్షిత ఆదిత్యలు దించిన తల ఎత్త లేకపోయారు...

★



## నలభయ్యేళ్ల కుర్రోడు

హీరోయిన్లు తమ వయసుని చెప్పడానికి ససేమిరా ఒప్పుకోరు. అలాగే కొంత మంది హీరోలు కూడా తమ అసలు వయసు దాచేసి చెబుతుంటారు. కానీ సంజయ్ దత్ మాత్రం తన వయసు చెప్పుకోడానికి ఎలాంటి వెనుకంజా వేయడు అని నిరూపించేలా ఇటీవల తన పుట్టిన రోజుని జరుపుకుంటూ- తన వయసు ఇప్పుడు '40 సంవత్సరాలు' అని ప్రకటించాడు. అయితే అతని కొత్త భార్య రియా మాత్రం 'సంజయ్ వయసు 39 ఏళ్లే. ఒక సంవత్సరం ఎక్కువేసుకుని చెబుతున్నాడాయన' అని వాపోయింది, భర్త వయసు ఎక్కువగా చెప్తేస్తున్నాడని. అసలు వ్యక్తి సంజయ్‌కి లేని బాధ పాపం రియాకెందుకో? అని సినీ జనాలు గుసగుసలాడుకుంటున్నారు.

- జె.ఎం.